**OFFICE OF THE**
**COMMISSIONER & DIRECTOR OF AGRICULTURE,**
**TELANGANA, HYDERABAD.**

**No.Prtg.(3)Adv.News/2020** **08-06-2020**

The Copy of News Items appeared in the daily news paper on 08-06-2020 are hereby communicated for your kind information.

08.06.2020-Sakshi-Nalgonda:
Clipping-27

# రుణమాఫీకి శ్రీకారం..!

- రూ.17.22 కోట్లు ఖాతాల్లో జమ
- తొలుత రూ.25 వేలలోపు రుణం ఉన్న రైతులకు
- రూ.లక్షలోపు ఉన్న వారికి రెండో దశలో
- బంగారం రుణాలపై స్పష్టత కరువు



నల్లగొండ అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. 2018 డిసెంబర్ నాటికి రూ.లక్ష లోపు ఉన్న పంటరుణా న్నింటినీ మాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఈ మేరకు రుణమాఫీకి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించింది. మొదటి దశలో రూ.25 వేలలోపు పంట రుణాన్ని మాఫీ చేసి రైతుల ఖాతాల్లో జమచేస్తామని, రెండో దశలో రూ.లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని, ఆ మేరకు బ్యాంకుల వారీగా జాబితాలను పంపించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. జిల్లాలోని 31 మండలాలకు సంబంధించి సుమారు 3,03,802 మంది రైతులు రుణాలను పొంది ఉన్నట్లు అధికారులు జాబితాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అందులో రూ.25 వేలలోపు పంటరుణాలను పొందిన రైతులు సుమారు 23,094 మంది రైతులు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదించగా.. ఇప్పటి వరకు రుణమాఫీకి అర్హత కలిగిన 10,515 మంది రైతులకు ఆయా బ్యాంకుల్లో రూ.17 కోట్ల 22 లక్షల 78 వేలు రాష్ట్ర ప్రభుత్వం జమచేసింది.

**కుటుంబంలో ఒక్కరికే..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణమాఫీని కుటుంబంలో ఒక్కరికే వర్తింపచేయనున్నందున, కుటుంబంలో ఎంత మంది రుణం తీసుకున్నా వారిలో ఒక్కరికి మాత్రమే రూ.25 వేల లోపు రుణాన్ని మాఫీ చేసింది. బ్యాంకులో రుణం పొందిన రైతులు తప్పక వారి బ్యాంకులో ఆధార్‌నంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్ నమోదు చేయని రైతులకు వారి ఖాతాల్లో రుణమాఫీని జమచేసే

- మిగతా 2లో

# రుణమాఫీకి శ్రీకారం..!

మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉండదని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. ఆధార్‌నంబర్‌ను ఖాతాకు లింక్ చేయని రైతులకు కూడా ఆధార్ నంబర్‌ను లింక్ చేసినట్లైతే (కుటుంబంలో ఒకరికి) రూ.25 వేలలోపు రుణమాఫీని లోన్ అకౌంట్‌లో జమచేసే అవకాశం ఉంటుంది. రైతులు ఆధార్ నంబర్‌లో విధిగా బ్యాంకుల్లో నమోదు చేయాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు.

**రూ.లక్షలోపు మాఫీకి ఎన్ని విడతలో..**

జిల్లా వ్యాప్తంగా రూ.లక్షలోపు రుణాలు ఉన్న వారు సుమారు లక్షన్నరకు పైగానే ఉన్నట్లు అనధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఈ లెక్కపై లీడ్ బ్యాంకు అధికారుల వద్ద కూడా సరైన సమాచారం లేకపోవడం శోచనీయం. అయితే రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఏకకాలంలో చేస్తుందా, లేద దశల వారీగా చేస్తుందా అనేది స్పష్టం చేయలేదు. దీంతో రైతులతోపాటు బ్యాంకు అధికారుల్లో కూడా అయోమయం నెలకొంది. ఏకకాలంలో రుణమాఫీని రైతుల లోన్ అకౌంట్‌లో జమచేసినట్లయితే వెంటనే ఆయా బ్యాంకుల నుంచి రైతులు తిరిగి పంటరుణం పొందడానికి సులువవుతుంది. బ్యాంకులు కూడా ఎలాంటి కొర్రీలు పెట్టకుండా రైతులకు తిరిగి వానాకాలం పంటరుణాలను అందించే అవకాశం ఉంటుంది. లక్షలోపు రుణమాఫీని ఏకకాలంలో చేసి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**గోల్డ్‌లోన్‌పై స్పష్టత కరువు..**

జిల్లాలో వేలాది మంది రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం అనేక బ్యాంకుల్లో పట్టాదార్ పాస్‌పుస్తకాల ఆధారంగా ఆభరణాలను పెట్టి రుణాలను పొందారు. అయితే ప్రభుత్వం బంగారు రుణాలను మాఫీ చేస్తుందా లేదా అనేది స్పష్టత ఇవ్వలేదు.

**వానాకాలం రుణాలు ఇస్తారా..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.25 వేల లోపు రుణాలను జమచేసిన నేపథ్యంలో బ్యాంకులు తిరిగి వానాకాలం పంటరుణాలను ఇస్తాయోలేదోననే అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ వస్తుందన్న ధీమాతో అనేక మంది రైతులు తమ రుణాలను రీషెడ్యూల్ కూడా చేసుకోలేదు. కనీసం వడ్డీనైనా చెల్లిస్తే వానాకాలం రుణాలను ఇవ్వడానికి అవకాశం ఉండేదని బ్యాంకు అధికారులు పేర్కొంటుండగా, రుణాలను తప్పక ఇవ్వాల్సిందేనని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. అయితే ఇప్పటి వరకు బ్యాంకులు వానాకాలానికి సంబంధించి పంటరుణాలను రైతులకు ఇచ్చిన దాఖలాలు కనిపించడం లేదు.

**ఆధార్ నంబర్‌ను నమోదు చేయించాలి**



రుణాలను పొందిన రైతులు తప్పకుండా తమ ఆధార్ నంబర్‌ను బ్యాంకులో నమోదు చేయించుకోవాలి. ఆధార్ నంబర్ నమోదు ఉంటేనే రుణమాఫీని చేసే అవకాశం ఉంటుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వానాకాలం పంట రుణాలను రైతులు బ్యాంకుల నుంచి తీసుకునే అవకాశం ఉంటుంది.

- జి.శ్రీధర్‌రెడ్డి, జేడీఏ